క్లుప్తంగా

3న మార్కెట్ వేలం పాటలు

పుంగనూరు: మున్సిపాలిటి పరిధిలోని వివిధ వ్యాపారాలకు సంబంధించిన వేలం పాటలను 3వ తేదీ ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని కమిషనర్ మధుసూదన్‌రెడ్డి శుక్రవారం విలేకరులకు తెలిపారు. గత నెల 24న ప్రైవేటు వాహనాలకు, పబ్లిక్ యూరినల్స్, దినసరి సంత, వారపుసంత, కూరగాయల మార్కెట్లకు వేలం నిర్వహించినా ఎవరూ రాకపోవడంతో వేలం వాయిదా వేసినట్లు చెప్పారు. ఆసక్తి గల వారు నిబంధనల మేరకు ధరావత్తు, సాల్వెన్సీ సర్టిఫికెట్లు జతపరచి, వేలంలో పాల్గొనాలని కోరారు.

6 నుంచి వెంకన్న బ్రహ్మోత్సవాలు

పుంగనూరు: స్థానిక కోనేటి వద్ద ఉన్న శ్రీ కళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 6వ తేదీ నుంచి 11 రోజులపాటు టీటీడీ ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు టెంపుల్ ఇన్‌స్పెక్టర్ మునీంద్రబాబు తెలిపారు. శుక్రవారం ఆలయాన్ని శుద్ధి చేసి, విద్యుత్ దీపాలు, చలువ పందిళ్లు ఏర్పాటు చేసే పనులకు శ్రీకారం చుట్టినట్టు చెప్పారు.

జింకను కాపాడారు



కుక్కలదాడిలో గాయపడిన జింకపిల్లకు చికిత్స చేస్తున్న దృశ్యం

పుంగనూరు: కుక్కల దాడి నుంచి జింక పిల్లను స్థానికులు కాపాడిన సంఘటన స్థానిక ఎన్ఎస్ పేటలోని ప్రకాశం కాలనీలో శుక్రవారం చోటుచేసుకుంది. కాలనీకి చెందిన రెడ్డెమ్మ ఇంటిలోనికి జింక పిల్లను కుక్కలు తరుముకుంటూ వచ్చాయి. దీనిని గమనించిన ఆ ప్రాంత ప్రజలు కుక్కలదాడి నుంచి జింక పిల్లను కాపాడారు. గాయపడిన జింకకు చికిత్స చేసి అటవీశాఖాధికారులకు అప్పగించడంతో వారు జింక పిల్లను అటవీ ప్రాంతంలో సురక్షితంగా వదిలారు.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

పుంగనూరు: పట్టణంలో శనివారం నుంచి నిర్వహించనున్న ఇంటర్ పరీక్షలకు 27 కేంద్రాలను ఏర్పాటు చేశారు. 30 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. ఈ సెంటర్లలో మొత్తం 826 మంది పరీక్షలు రాయనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్లు కమలాకర్, మురళీధర్ తెలిపారు. విద్యార్థులు సకాలంలో ఆయా కేంద్రాలకు చేరుకోవాలని కోరారు.

వి.కోటలో..

వి.కోట: ఇంటర్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసిన్నట్లు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ బాలక్రిష్ణ శుక్రవారం తెలిపారు. మండలంలో మొత్తం 1349 మంది ఇంటర్మీడియట్ విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చెప్పారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీతోపాటు వాణి జూనియర్ కాలేజీని పరీక్ష కేంద్రాలుగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

సదుంలో..

సదుం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి ప్రారంభం కానున్న ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చీఫ్ సూపరింటెండెంట్, ప్రిన్సిపల్ వెంకటనాథ రెడ్డి, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ వెంకటరమణారెడ్డి తెలిపారు. ఫస్టియర్‌లో 292 మంది, సెకండియర్‌లో 200 మంది విద్యార్థులు పరీక్షకు హాజరవుతున్నట్టు వారు చెప్పారు. పరీక్ష 9 గంటలకు ప్రారంభం అవుతుందని, విద్యార్థులు 8.30 గంటలకే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలన్నారు.

శ్రీకాళహస్తీశ్వరుడికి పట్టువస్త్రాల సమర్పణ



కాణిపాకం: శ్రీకాళహస్తిలోని స్వామి వారికి కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయ తరపున పట్టువస్త్రాలు సమర్పించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని ఆలయ అధికారులు స్వామికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఈవో పెంచలకిషోర్ దంపతులు, అక్కడి ఈవో బాపిరెడ్డి, డీఈఓ కృష్ణారెడ్డి, ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి ఊరేగింపుగా వెళ్లి పట్టువస్త్రాలు సమర్పించారు.



రథోత్సవం

పుంగనూరు: మండలంలోని నెక్కుంది గ్రామ కొండలపై ఉన్న శ్రీ అగస్తీశ్వరస్వామి రథోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. తొలుత ఆలయ అర్చకులు షణ్ముగ దీక్షితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. వేలాది మంది భక్తులు స్వామివారి రథాన్ని లాగారు. శివ నామస్మరణ చేస్తూ రథంపై మిరియాలు, ఉప్పు, బొరుగులు చల్లారు. టెంకాయలు కొడుతూ మొక్కులు చెల్లించారు. భక్తులకు అన్నదానం చేశారు.



ప్రాకారోత్సవం

బైరెడ్డిపల్లి: మండలంలో కోట్రీపల్లె గ్రామ సమీపంలోని శ్రీ కాళభైరవేశ్వరస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ప్రాకారోత్సవం వైభవంగా నిర్వహించారు. శ్రీగిరిజా సమేత కాళభైరవేశ్వరస్వామి ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలు, అభిషేకాల అనంతరం మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఆలయం చుట్టూ ప్రాకారోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలను అందజేశారు.



గంగమ్మా..నమోస్తుతే..!

చౌడేపల్లి: బోయకొండ గంగమ్మ ఆలయంలో అమ్మవారికి శుక్రవారం భక్తిశ్రద్ధలతో రాహుకాల అభిషేకపూజలు నిర్వహించారు. ఉదయాన్నే ఆలయ అర్చకులు అమ్మవారి గర్భాలయాన్ని శుద్ధి చేసి, రాహుకాల సమయంలో పూజార్చనలు, అభిషేకాల అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా బంగారు నగలు, రంగు రంగు పూలతో ముస్తాబుచేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. అలాగే భక్తులకు ఉచిత అన్నప్రసాదాల వితరణ చేశారు.

సాంకేతికత వైపు విద్యార్థులను నడిపిద్దాం







పులిచెర్ల: మాట్లాడుతున్న శాస్త్రవేత్త కరీముల్లా, రొంపిచెర్ల: బొమ్మయ్యగారిపల్లెలో మాట్లాడుతున్న హెచ్ఎం, చౌడేపల్లె: మేళాను పరిశీలిస్తున్న ఎంఈఓ

- శాస్త్రవేత్త కరీముల్లా పిలుపు

పులిచెర్ల(కల్లూరు): దేశాభివృద్ధిలో శాస్త్ర, సాంకేతికత పరిజ్ఞానం ఎంతో కీలమని, ఆ దిశగా విద్యార్థులను నడిపించాల్సిన బాధ్యత టీచర్లపై ఉందని ఐసీఏఆర్ శాస్త్రవేత్త కరీముల్లా అన్నారు. శుక్రవారం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సైన్స్ డేలో ఆయన మాట్లాడారు. సైన్స్ మేళాను సందర్శించి, విద్యార్థులకు బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఎంఈఓ సిద్ధరామయ్య, హెచ్ఎం శ్రీవాణి, ఎస్ఎంసీ చైర్మన్ అష్రూఫ్, వెంకట సిద్ధులు, రాజేంద్ర, రేణుకాదేవి, గురవయ్య, చంద్రబాబు, దేవేంద్రరెడ్డి, రహమత్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రయోగాలతో విద్యార్థుల్లో మేధాశక్తి పెంపు

రొంపిచెర్ల: సైన్సు ప్రయోగాలతో విద్యార్థుల్లో దాగి ఉన్న మేధాశక్తిని ఉపాధ్యాయులు వెలికితీయాలని బొమ్మయ్యగారిపల్లె ఉన్నత పాఠశాల హెచ్ఎం హైమావతి అన్నారు. బొమ్మయ్యగారిపల్లె క్లస్టర్ పరిధిలోని పాఠశాలలతో కలసి సైన్సు డే పోటీలు నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలించి అభినందించారు. అనంతరం బహుమతులను ప్రదానం చేశారు. ఉపాధ్యాయులు అఫీజుల్లా, రెడ్డెప్పనాయుడు, రమేష్, వెంకటనారాయణ, సుధాకర్, కళ్యాణి, స్వర్ణలత, ప్రకాష్, రంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీవీ రామన్‌కు ఘన నివాళి

చౌడేపల్లె: స్థానిక ఉన్నత పాఠశాలలో సైన్స్ మేళాను ఎంఈఓ తిరుమలమ్మ ప్రారంభించారు.తొలుత శాస్త్రవేత్త సీవీ రామన్ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. క్లస్టర్ పరిధిలోని 20 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులకు బహుమతులు అందజేయనున్నట్లు హెచ్ఎం నాగరాజు రెడ్డి తెలిపారు.





సదుం: బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు, పుంగనూరు జెడ్పీ హైస్కూల్‌లో..

శాస్త్రీయ దృక్పథం అవసరం

సదుం: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం కలిగి ఉండాలని రిటైర్డ్ సైంటిస్ట్ డాక్టర్ కరీముల్లా, హెచ్ఎం జయకుమార్ రెడ్డి తెలిపారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో క్లస్టర్ స్థాయిలో సైన్స్‌మేళా నిర్వహించారు. విద్యార్థులు సుమారు 40 నమూనాలను ప్రదర్శించారు. వివిధ పోటీలలో ప్రతిభ చూపిన వారికి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు.

సైన్సు పరిజ్ఞానం అవసరం

పుంగనూరు: జాతీయ సైన్సు దినోత్సవం పురస్కరించుకుని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో శుక్రవారం ఎంఈఓలు చంద్రశేఖర్‌రెడ్డి, రెడ్డెన్నశెట్టి ఆధ్వర్యంలో సైన్సు ఫేర్ నిర్వహించారు. కొత్తయిండ్లు హైస్కూల్, అడవినాథునికుంట మోడల్ స్కూల్‌లో నమూనాలు ఆకట్టుకున్నాయి. సైన్సు పరిజ్ఞానం ప్రతి ఒక్కరికీ అవసరమని ఎంఈఓలు అన్నారు. రాయలసీమ చిల్డ్రన్స్ అకాడమి, భాష్యం పాఠశాలల్లో డైరెక్టర్లు చంద్రమోహన్‌రెడ్డి, సుబ్రమణ్యం ఆధ్వర్యంలో సైన్స్ డే నిర్వహించారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు.

అభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకం

బైరెడ్డిపల్లె: మానవాళి అభివృద్ధిలో సైన్స్ పాత్ర కీలకమైనదని ఎంఈఓ సుబ్రమణ్యం అన్నారు. బైరెడ్డిపల్లె, కడపనత్తం, నెల్లిపట్లలోని జెడ్పీ హైస్కూళ్లలో సైన్స్ మేళా నిర్వహించారు. విద్యార్థులు సైన్స్ ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో తయారు చేసిన ప్రాజెక్టులు, నమూనాలు ప్రదర్శించారు. ఆయా పాఠశాలల హెచ్ఎంలు, సీఆర్‌పీలు పాల్గొన్నారు.

శాంతిపురంలో..

శాంతిపురం: క్లస్టర్ ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన సైన్స్ మేళాలో విద్యార్థులు వివిధ నమూనాలను ప్రదర్శించారు. ఇక్కడ విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. శాంతిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, శెట్టిపల్లి జెడ్పీ హైస్కూల్లో నిర్వహించిన మేళాలో ఎంఈఓ-2 తీగల వెంకటయ్య మాట్లాడారు. విద్యార్థులు ప్రదర్శించిన వివిధ నమూనాలను పరిశీలించి ఉత్తమ నమూనాలను ఎంపిక చేసి బహుమతులను అందజేశారు. తుమ్మిశి జెడ్పీ హైస్కూల్లో హెచ్ఎం ధనలక్ష్మమ్మ సైన్స్ మేళా విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. హెచ్ఎంలు నాగరాజరెడ్డి, నరసింహులు, శిల్ప, అనికెర సర్పంచ్ శంకర్ పాల్గొన్నారు.







పుంగనూరు: అడవినాథునికుంట ఆదర్శ పాఠశాలలో..., శాంతిపురం: విద్యార్థుల ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈఓ2 వెంకటయ్య, కడపనత్తం జెడ్పీ హైస్కూల్లో..

సృజనాత్మకత పెంచేందుకే ప్రయోగాలు



సైన్స్ మేళాను సందర్శిస్తున్న అతిథులు

వి.కోట: విద్యార్థుల్లోని సృజనాత్మకతను పెంచేందుకు సైన్సుప్రయోగాలు దోహదం చేస్తాయని స్థానిక వాణి విద్యాసంస్థల అధినేత, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ బాలగురునాథ్ అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని మండలంలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్లలో ఘనంగా నిర్వహించారు. వాణి పాఠశాలలో సైన్స్ మేళాకు కుప్పం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జగన్నాథరావు, సీనియర్ ఫిజిక్స్ లెక్చరర్ ఎస్ వెంకట్రామన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. 220 మంది విద్యార్థులు ప్రదర్శించిన 150 ప్రయోగాలను పరిశీలించారు. సీవీ రామన్ శాస్త్రీయ దృక్పథంతో విద్యార్థులు ముందుకుపోవాలని ఆకాంక్షించారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ సైన్సు దినోత్సవం



పలమనేరు బాలికోన్నత పాఠశాలలో నమూనాలను పరిశీలిస్తున్న ఎంఈఓలు



పలమనేరు: హైస్కూల్‌లో విజేతలకు బహుమతలను అందిస్తున్న దృశ్యం

ఆకట్టుకున్న విద్యార్థుల ప్రయోగాలు

పలమనేరు: జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకుని మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం విజ్ఞాన ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. స్థానిక ప్రభుత్వ బాలుర, బాలికల, పెంగరగుంట, ఎంపీ కోటూరు ఉన్నత పాఠశాలలో సైన్స్ మేళాలను ఎంఈవోలు లీలారాణి, బాలసుందరం ప్రారంభించి విద్యార్థుల ప్రయోగాలను పరిశీలించారు. విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో దోహదం చేస్తాయన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన సైన్స్‌డే పోటీలో ప్రిన్సిపాల్ బాబు మాట్లాడారు. సమాజానికి అవసరమైన ప్రయోగాలు మంచిపేరును తీసుకొస్తాయన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. స్థానిక శ్రీచైతన్యస్కూల్‌లో సైన్స్ మేళాకు గ్రామీణ శాస్త్రవేత్త పవన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మండలంలోని పలు స్కూళ్లలో విద్యార్థులు ప్రదర్శించిన పీఎస్ఎల్‌వీ రాకెట్ నమూనా, హృదయం, జీర్ణవ్యవస్థ, వాతావరణం, నీటి ఆవిరితో నడిచే జేసీబీ, ఆటోమేటిక్ ట్రాఫిక్ సిగ్నల్ సిస్టం, హోమ్ థియేటర్, గాలి, నీటితో పనిచేసే వాక్యూమ్ క్లీనర్ల ప్రయోగాలు, జనతా ఫ్రిడ్జి, అగ్ని పర్వతాల నమూనాలు మొదలైనవి ఆకట్టుకున్నాయి.



విద్యార్థులను అభినందిస్తున్న గ్రామీణ శాస్త్రవేత్త పవన్

కవర్లతో నాణ్యమైన మామిడి దిగుబడులు



కాయలకు కవర్లు తొడిగిన మామిడి తోట

శాంతిపురం/వీకోట: మామిడి కాయలకు కవర్లు తొడగటం మూలాన నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని ఉద్యావనవన శాఖాధికారులు వింధ్య,లక్ష్మీ ప్రసన్న చెప్పారు. రైతులకు అవసరమైన కవర్లు 50 శాతం రాయితీతో అందుబాటులో ఉన్నాయన్నారు. మామిడి కాయలు నిమ్మకాయ అంతసైజులో ఉన్నప్పుడు కాయలకు కవర్లు కడితే మంచి రంగు రావడంతో పాటు నాణ్యమైన దిగుబడులు పొందవచ్చని చెప్పారు. ఎకరాకు 4 వేల కవర్ల చొప్పున ఒక్కో రైతు గరిష్టంగా పది వేల కవర్లను సబ్సిడీపై పొందవచ్చని, రైతులు ఆధార్ కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జెరాక్సులు, ఒరిజినల్ పట్టాదారు పాసుపుస్తకంతో వచ్చి వాటిని పొందవచ్చన్నారు. సబ్సిడీపై ఒక కవర్ రూపాయికి ఇస్తామన్నారు. శాంతిపురం, గుడుపల్లె మండలాల రైతులకు మామిడి కవర్లు అబకలదొడ్డి రైతు సమాచార కేంద్రంలో ఉన్నాయని చెప్పారు. ఆయా మండలాల్లోని రైతు సేవా కేంద్రాల్లో సంప్రదించాలని కోరారు.

20 పొట్టేళ్లు చోరీ

చౌడేపల్లె: మండలంలోని తోటకురపల్లెలో గురువారం రాత్రి ఆగంతకులు 20 పొట్టేళ్లను చోరీ చేసి వాహనంలో తరలించినట్లు బాధితుడు రైతు చెంగారెడ్డి శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. చెంగారెడ్డి పొట్టేళ్లు మేపుతూ జీవనం సాగిస్తుండేవాడు. సాయంత్రం ఇంటి వద్ద పశువుల పాకలో తోలి నిద్రపోయాడు. ఉదయాన్నే లేవగా సుమారు రూ.3 లక్షల విలువ చేసే 20 పొట్టేళ్లు లేవని గుర్తించాడు. సమీపంలో ఓ ఇంటి వద్ద అమర్చిన సీసీ కెమెరాలో రాత్రి 1.47 నిమిషాలకు బొలెరో వాహనంలో పొట్టేళ్లను తరలించినట్లు ఆధారాలతో చెంగారెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బడ్జెట్‌లో మొండిచేయి



సోమచంద్రారెడ్డి

పలమనేరు: ఏపీ బడ్జెట్‌లో కూటమి ప్రభుత్వం ఉద్యోగులకు మొండిచేయి చూపిందని నియోజకవర్గ పెన్షనర్ల అసోసియేషన్ అధ్యక్షులు సోమచంద్రారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో నిరసన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయ, ఉద్యోగ, పెన్షనర్ల బకాయిల మాట దేవుడెరుగు పీఆర్సీ, ఐఆర్, డీఏకి సైతం బడ్జెట్‌లో కేటాయింపులేవీ చేయకపోవడం శోచనీయమన్నారు. తాము అధికారంలోకి వస్తే ఐఆర్‌తో నిమిత్తం లేకుండా పీఆర్సీ ఇస్తామని ఊదరగొట్టిన చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు.

అప్పు చెల్లించమంటే వృద్ధురాలిపై దాడి

బైరెడ్డిపల్లె: అప్పు చెల్లించమని డిమాండ్ చేస్తూ ఇంటి ముందు బైఠాయించిన వృద్ధురాలిపై ఇనుపరాడ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరచిన నిందితుడితో పాటు మరో ఆరుగురిపై కేసు నమోదు చేసినట్టు శుక్రవారం ఎస్ఐ పరశురాముడు తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు..మండలంలోని కొత్తయిండ్లుకు చెందిన సుబ్బమ్మ గ్రామానికి చెందిన వెంకటేష్‌కు రూ.70 వేలు అప్పు ఇచ్చింది. ఆ తర్వాత ఎన్నోసార్లు అడిగినా వెంకటేష్ అప్పు తిరిగి చెల్లించకపోవడంతో విసిగి వేసారిన సుబ్బమ్మ వెంకటేష్ ఇంటి ముందు బైఠాయించి నిలదీసింది. దీంతో ఆగ్రహించిన వెంకటేష్‌తో పాటు మరో ఆరుగురు సుబ్బమ్మపై ఇనుపరాడ్లతో దాడిచేశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

రుణాలకు 1,512మంది దరఖాస్తు

కుప్పం: కార్పొరేషన్ రుణాల మంజూరు ఇంటర్వ్యూలు శుక్రవారం కూడా కొనసాగాయి. కుప్పం మున్సిపాలిటీ పరిధిలో దరఖాస్తులు చేసిన అభ్యర్థులకు సచివాలయంలో వివిధ బ్యాంకు మేనేజర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 25 వార్డులకు గాను ప్రభుత్వం బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, కాపు కార్పొరేషన్ రుణాలు మొత్తం కలిపి 129 మంజూరు చేసింది. వీటికి అభ్యర్థులు ఆన్‌లైన్‌తోపాటు అధికార పార్టీ కార్యాలయం ద్వారా మొత్తం 1512 మంది దరఖాస్తు చేసుకున్నారు. సగటున ఒక రుణం కోసం పది మంది పోటీపడినట్లైంది. ఇంటర్వ్యూ లకు వీరంతా రావడంతో సచివాలయం కిటకిటలాడింది. అభ్యర్థులు ఇంటర్వ్యూ విధానాన్ని గమనించి అభ్యర్థులు నిరాశకు గురయ్యారు. ఉపాధి కల్పన కోసం ఆర్థిక సాయం చేస్తుందని ఆశపడితే ఆశలు అడియాశలయ్యాయని పలువురు ఆవేదన చెందారు.

ఘనంగా టైలర్స్ డే

పుంగనూరు: టైలర్స్ డే పురస్కరించుకుని శుక్రవారం పుంగనూరులో టైలర్లు భారీ ర్యాలీ నిర్వహించారు. కుట్టుమిషన్ రూపకర్త ఇలియాస్‌హో చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అలాగే పేదలకు అన్నదానం చేశారు. టైలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు ఖాసిమ్ మాట్లాడుతూ, టైలర్లకు ప్రత్యేకమైన నివాస గృహాలు కేటాయించి, కాలనీ ఏర్పాటు చేయాలని, అర్హులైన టైలర్ల కుటుంబాలకు పెన్షన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సురేంద్ర, అస్లాంబాషా, నరసింహులు, చంద్ర, గులాబ్ బాషా, సురేష్‌బాబు, శ్రీనివాసులు, అతావుల్లా, బాషా, రవి, నిజాముద్దీన్, రహత్‌జాన్, షబానా, మంగమ్మ, ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న టైలర్స్ అసోసియేషన్ నాయకులు

భర్తను బెదిరించబోయి..!

చౌడేపల్లె: భర్తతో గొడవ పడిన ఓ వివాహిత అతడిని బెదిరించేందుకు చేసిన యత్నం చివరకు ఆమె ప్రాణాలనే బలిగొంది. ఈ సంఘటన శుక్రవారం రాత్రి పందిళ్లపల్లె పంచాయతీ ముదిరెడ్డిపల్లె యానాది ఇండ్లులో చోటుచేసుకుంది. చోటుచేసుకుంది. స్థానికుల కథనం.. గ్రామానికి చెందిన చిన్నప్ప, అతని భార్య యర్రమ్మ(30) గురువారం ఘర్షణ పడ్డారు. భర్తను బెదిరించడానికి ఇంట్లో ఉన్న పురుగుల మందు తాగింది. అపస్మార స్థితికి చేరిన ఆమెను 108 సహాయంతో పుంగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ యర్రమ్మ మృతి చెందింది. ఎస్ఐ నాగేశ్వరరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.